క్లుప్తంగా

డబ్బుల వసూలుపై విచారణ

పలిమెల : మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్లను నిర్ణీత ధరలకంటే వినియోగదారుల వద్ద ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు గిరిజన సహకార సంఘం డీఎం ప్రతాప్‌రెడ్డి వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్యాస్ డెలివరీ బాయ్‌ని తొలగించినట్లు జీసీసీ మేనేజర్ హరిలాల్ తెలిపారు. నివేదికను ఐటీడీఏ పీఓకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సన్మానం



కాటారం : మండలంలోని దామెరకుంటకు చెందిన జాతీయ సేవారత్న అవార్డు గ్రహీత ఆత్మకూరి స్వామియాదవ్‌ను మంగళవారం అఖిలభారత యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం నాయకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గడ్డం చంద్రయ్య, కొమురయ్య, మొగిలి రాజ్‌కుమార్, ఆత్మకూరి కుమార్ పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన

కాటారం : ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్న ఆధునిక సాంకేతిక విధానాల అవగాహన కార్యక్రమ ప్రారంభోత్సవంపై మండల కేంద్రంలోని రైతువేదికలో నేడు(బుధవారం) రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి గిరి రామకృష్ణ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఓ కోరారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులు రాస్తున్న పరీక్షను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోని సౌకర్యాలపై ఆరా తీశారు.

'మాక్ పోలింగ్'



చిట్యాల : పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు మాక్ పోలింగ్ దోహదపడుతుందని ఉపాధ్యాయురాలు రూపశ్రీ తెలిపారు. మంగళవారం మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలలో నమూనా ఎన్నికల కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ లీడర్ ఎన్నికల్లో 9వ తరగతికి చెందిన శర్మాని ఎన్నికైంది. ఎన్నికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

విజయవంతం చేయాలి



భూపాలపల్లి రూరల్ : ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రేపు (గురువారం) వరంగల్‌లో నిర్వహించే కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు భిక్షపతి, నోముల శ్రీనివాస్, రాజేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఏటూరునాగారం : ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా చిత్రామిశ్రా బాధ్యతలను చేపట్టడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ వెనుకబడిన ఏజెన్సీ ప్రాంత గిరిజనుల సమస్యల పరిష్కారం, పేదల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కృషి చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, టౌన్ అధ్యక్షుడు ఎండీ సులేమాన్, నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కాటారం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ బాబు, ఎంపీఓ ఉపేంద్రయ్య మంగళవారం తెలిపారు. గృహజ్యోతి పథకం లబ్ధిదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు, కరెంట్‌బిల్లు, ఫోన్‌నంబర్‌తో సేవా కేంద్రానికి వస్తే ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ(కొత్తపల్లిగోరి) : గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని రావులపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం, కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి, గాంధీనగర్, విజ్జయ్యపల్లి గ్రామాలలో ఒక్కో భవనానికి సుమారు రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. ఆరు గ్యారంటీ పథకంలో భాగంగా ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, మండల ప్రత్యేక అధికారి శామ్యూల్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు గుటోజు కిష్టయ్య, మేకల భిక్షపతి, పున్నం రవి, సూరం వీరేందర్, సూదనబోయిన ఓంప్రకాష్, అమ్ముల స దయ్య, పత్తి ప్రభాకర్, బోయిని వినోద్, చిగురుమామిడి కుమారస్వామి,వీరస్వామి, రవి పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ జయశ్రీ, జెడ్పీటీసీ సదయ్య, విద్యుత్ ఏడీ శ్రీనివాస్, ఏఈ ప్రమోద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు మధు వంశీ, అప్పం కిషన్, లింగారావు, రాజు, రాము, రఫీ, సుదర్శన్ గౌడ్, బక్కిరెడ్డి, పున్నం చందర్‌రావ్, వెంకటేశ్వర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: ఇండియన్ జర్నలిస్టు యూనియన్(ఐజేయూ)డైరీని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యాం, సామల శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

కోటంచ ఆలయ చైర్మన్‌గా భిక్షపతి



రేగొండ: మండలంలోని కొడవటంచ గ్రామంలోని ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ పదవీపై ఉత్కంఠకు తెరపడింది. ఆలయ చైర్మన్‌గా కోటంచ గ్రామానికి చెందిన ముల్కనూరి భిక్షపతి ని ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గండ్ర సత్యనారాయణరావు ఎమ్మెల్యేగా గెలి పొందాడు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి రావడంతో కోటంచ ఆలయ చైర్మన్ పద వి కోసం ఆశావాహులు వందల సంఖ్యలో ఎమ్మెల్యే ని కలిశారు. కానీ 20 సంవత్సరాలుగా ఎమ్మెల్యే స త్యనారాయణరావుకి వీరవిధేయుడిగా గుర్తింపు పొందిన భిక్షపతి చైర్మన్ పీఠాన్ని అధిరోహిస్తున్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

నేడు (బుధవారం)కొడవటంచ ఆలయ చైర్మన్‌గా భిక్షపతితో పాటు 14 మంది ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొంటారని ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రకాశ్‌రెడ్డి

పలిమెల : వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎంపీఓ, ముకునూరు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రకాశ్‌రెడ్డి పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం ముకునూరు గ్రామపంచాయతీ పరిధిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ఎద్దడి రాకుండా చర్యలు, ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు, నర్సరీలో మొక్కల పెంపకంపై చర్చించారు. అనంతరం ప్రకాశ్‌రెడ్డి దమ్మూరు పంచాయతీని సందర్శించి అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. నర్సరీని సందర్శించి వందశాతం మొక్కలు పెరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వినయ్‌కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ



పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చైర్మన్ నరేష్‌రెడ్డి తదితరులు

మంగపేట : మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో ఈనెల 8న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే మహోత్సవ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను దేవస్థానం చైర్మన్ కోలగట్ల నరేష్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఈనెల 8న తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలను ఉంటాయని తెలిపారు. అదే రోజు రాత్రి 11 గంటలకు ఉమాచంద్రశేఖరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులచే శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నరేష్‌శర్మ, కమిటీ సభ్యులు కొమరగిరి కేశవరావు, సాంబ్రాజ్యం, చాద మల్లయ్య, కల్లెబోయిన సురేష్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

మహాముత్తారం : మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కన్నెవేణి ఐలి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి, 25కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, లిక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'కేసు నమోదు సరికాదు'

ములుగు రూరల్ : గట్టమ్మ ఆలయం వద్ద ఆదివాసీ నాయకపోడ్‌లకు, ముదిరాజ్ సంఘాల మధ్య ఘర్షణకు పాల్పడితే పోలీసులు ముదిరాజ్ సంఘం సభ్యులపై కేసులు నమోదు చేయడం సరికాదని మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయం వద్ద ఇరు వర్గాలు గొడవకు దిగిన సమయంలో పోలీసులు అక్కడే ఉన్నారని, ఇరువర్గాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఘర్షణకు ప్రేరేపించిన నాయకపోడులపై కేసు నమోదు చేయాలని కోరారు. ముదిరాజ్ సంఘం సభ్యులుపై అట్రాసిటీ కేసు నమోదు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు

మహదేవపూర్: మండలంలోని సూరారం, అంబట్‌పల్లి, పెద్దంపేట గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సంజీవరావు మంగళవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. తోటలకు 3 నెలలకు ఒకసారి యూరియా, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను వాడాలన్నారు. వేసవిలో వేడి గాలుల నుంచి చెట్లను రక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంలో డివిజనల్ ఉద్యాన అధికారి రమేష్, ఏఈఓ రచన, ఫీల్డ్ అధికారి రాజేందర్‌రెడ్డి ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రిక హైమావతి

● నాలుగు కొలువులకు ఎంపిక



భూపాలపల్లి రూరల్: ఇటీవల విడుదలైనా ప్రభుత్వ ఉద్యోగాల ఫలితాల్లో భూపాలపల్లి పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన దేవునూరి హైమావతి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. టీజీటీ బయో సైన్స్, జనరల్, జూనియర్ లెక్చరర్ కెమిస్ట్రీ, పీజీటీ ఫిజికల్ సైన్స్ గ్రాడ్యుయేషన్ టీచర్ పోస్టులకు ఎంపికై నట్లు హైమావతి తెలిపింది. నాలుగు పోస్టులకు ఎంపిక కావడం పట్ల హైమావతి తల్లిదండ్రులు సులోచన–స్వామి, సోదరుడు భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. హైమావతి చిన్నతనం నుంచే చదువులో చురుకుగా ఉండేదని ఆమె తండ్రి స్వామి తెలిపారు. 1 నుంచి10వ తరగతివరకు జంగేడు వివేకానంద విద్యాలయం, ఇంటర్ నర్సంపేట సిద్ధార్థ జూనియర్ కళాశాల, డిగ్రీ న్యూసైన్స్ కళాశాల హనుమకొండ, పీజీ హైదరాబాద్‌లో చదువుకున్నారు. తల్లిదండ్రులతో పాటు భర్త అనిల్ ప్రోత్సాహంతోనే హైదరాబాద్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యానని, జూనియర్ లెక్చరర్ పోస్టుకు వెళ్తానని తెలిపారు.ఈ సందర్భంగా కాకతీయ కాలనీ వాసులు ఆమెను అభినందించారు.

టేకు కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎడ్లబండ్లు, టేకు దుంగలు

మహదేవపూర్ : మండలంలోని ఎనుకపల్లి గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను పట్టుకున్నట్లు అటవీ సెక్షన్ అధికారి వరుణ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గోదావరి ద్వారా తరలించిన టేకు దుంగలు కాటారం మండలానికి చెందిన వ్యక్తులు ఎడ్లబండ్ల ద్వారా తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఎనుకపల్లి అటవీగుండా వెళ్లగా వాగులో బండ్లను విడిచి వేసి ఎడ్లతో నిందితులు పారిపోయారు. కాగా, బండ్లను 13 టేకు దుంగలను స్వాధీనం చేసుకొని మహదేవపూర్‌లోని కలప డిపోకు తరలించినట్లు అటవీ సెక్షన్ అధికారి వరుణ్, బీట్ అధికారి కృష్ణకర్ తెలిపారు.

పల్స్ ఆక్సీ మీటర్ల పంపిణీ



ఆక్సీ మీటర్లు అందజేస్తున్న సురేష్

మంగపేట: మండలంలోని పలు బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పల్స్ ఆక్సీ మీటర్లను ఉచితంగా మంగళవారం పంపిణీ చేసినట్లు ఐఆర్‌సీఎస్ ఎంసీ మెంబర్ కల్లె బోయిన శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చుంచుపలి కస్తూర్బా, ప్రభుత్వ గిరిజన బాలికల, బ్రహ్మణపల్లి, కోమటిపల్లి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు తిమ్మంపేట గిరిజన బాలుర వసతి గృహంలో ఆక్సీ మీటర్లను సంబంధిత వార్డెన్లకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న నాయకులు

కాళేశ్వరం : ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు– ఐఏఎస్ శైలజ రామయ్యర్ పెళ్లిరోజును పురస్కరించుకొని కాంగ్రెస్‌పార్టీ నాయకులు కాళేశ్వరాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, ఎస్సీ సెల్ రాజాబాపు, డీసీసీ ప్రధానకార్యదర్శి శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచ్ సత్తమ్మ, కవిత, బ్లాక్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అశోక్, బాబా, హైదర్, శకీల్, జానీ, సారయ్య, లక్ష్మణ్, మధు, సత్యానారాయణ, రయాన్, సడువలి, నాగేష్, సమద్, రవి, నబి, పవన్, అమీన్, వెంకటస్వామి, అరుణ్, సీతయ్య, సంతు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని విజయపురి కాలనీలో పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. విజయపురి కాలనీకి చెందిన గగ్గురి పోషమ్మ (27) భర్త శ్రీశైలం కొంత కాలంగా మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలను పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. కాగా శ్రీశైలం పోషమ్మను ఇబ్బందులు పెడుతుండడంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందుతాగి అత్మహత్య యత్నానికి పాల్పడిందని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పోషమ్మను ఎదిర వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమించడంతో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. కాగా మంగళవారం మృతురాలి తండ్రి వాదం ముత్యాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

కొనసాగిన 'పల్స్ పోలియో'



పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు



పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ అభినవ్

మహదేవపూర్ : మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడో రోజు పల్స్ పోలియో కార్యక్రమం మంగళవారం కొనసాగింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మిర్చి ఏరేందుకు వచ్చి పెద్దంపేట వాగులో గుడిసెలు వేసుకున్న కూలీల పిల్లల వద్దకు వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, హెల్త్ అసిస్టెంట్ మషక్ ఆలీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని మారుమూల అటవీ గ్రామాలైన దొడ్ల, కొండాయి, మల్యాల, కొత్తూరు గ్రామాల్లో కన్నాయిగూడెం ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. అలాగే పల్స్ పోలియో కార్యక్రమం మూడో రోజులో భాగంగా వైద్యాధికారి అభినవ్ ఆధ్వర్యంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండాయి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ తిరుపతయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రమణకుమారి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు, ఆశ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, సునీత, రాణి, రమాదేవి, సరస్వతి పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

మహాముత్తారం : మహాముత్తారం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన మహేందర్ కుమార్ యాదవ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు జాటోత్ వంశీరాజ్, పెగడపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు రామగిరి రాజయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వావిళ్ల మధుకర్, యువజన నాయకులు ఏం సింగ్ నాయక్, ముక్లోత్ సునీల్ నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.


ఓటును వినియోగించుకోవాలి

వెంకటాపురం(కె): ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్ సూచించారు. ప్రజలకు ఎన్నికల్లో విశ్వాసం కలిగే విధంగా సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి మండల కేంద్రంలో మంగళవారం కవాతు నిర్వహించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు సంఘ విద్రోహ శక్తుల నుంచి ఎలాంటి భయందోళనకు లోనవ్వకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

రాణాలో బర్త్ డే వేడుకలు!

మొగుళ్లపల్లి : ఓ కేసులో అనుమానిత నిందితుడిగా ఉన్న వ్యక్తి బర్త్ డే వేడుకలను పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించడం చర్చానీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వ్యక్తి ఒక కేసులో అనుమానిత నిందితుడిగా ఉన్నాడు. కాగా అతడి జన్మదినమైన సోమవారం మిత్రులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పుట్టిన రోజున రావడంతో ఎస్సై మాధవ్ కేక్ కట్ చేయించినట్లు సమాచారం. కాగా ఈ విషయం సోషల్ మీడియాలో మంగళవారం వైరల్ అయింది. అయితే సదరు ఎస్సై నెలన్నర క్రితమే బదిలీపై ఇక్కడికి వచ్చారు. మేడారం జాతర, మేడిగడ్డ సీఎం పర్యటన తదితర విధులను నిర్వర్తించారు. ఈ విషయమై ఎస్సై మాధవ్‌ను వివరణ కోరగా.. బర్త్ డే వేడుకలు తాను జరుపలేదని, వారే ఒక పక్కన నిలబడి కేక్ కట్ చేసుకున్నారని తెలిపాడు.

అభివృద్ధికి దూరంలో శివాలయం!



శివాలయం



ఆలయంలో లక్ష్మీనారాయణుడు, సూర్యభగవానుడు, రాముడు

రేగొండ : కాకతీయుల కాలంలో రాతి స్తంభాలతో నిర్మించిన కళా సంపద అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండల కేంద్రంలోని గడిపల్లి గ్రామంలోని శైవ, వైష్ణవం ఒకే చోట కొలువైన అరుదైన శివాలయాన్ని నిత్యం ప్రజలు దర్శించుకునేలా అభివృద్ధి చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలే స్వచ్ఛంద ంగా శివరాత్రికి ఏర్పాట్లు చేసి పూజలు చేస్తున్నారు.

ఐదో శతాబ్దపు చారిత్రక సంపద

గడిపల్లి గ్రామంలోని ఈ ఆలయం ఐదో శతాబ్దంలో కాకతీయులు నిర్మించినట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయులు శైవారాధన చేసే క్రమంలో కొన్ని చోట్ల వైష్ణవ దేవుళ్లను పూజించారు. అందుకే ఈ ఆలయంలో శివలింగం, నంది, రాముడు, సూర్యభగవానుడు, లక్ష్మీనారాయణుడు, హనుమంతుడి విగ్రహాలు దర్శనం ఇస్తున్నాయి. ప్రభుత్వం, అధికారులు పట్టించుకుని ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, ఈ నెల 8న మహా శివరాత్రి వేడుకలు ఉన్నందున కనీస వసతులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

అయోధ్యకు తరలిన భక్తులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి పట్టణం నుంచి రామభక్తులు మంగళవారం అయోధ్యలోని బాల రాముడిని దర్శించుకునేందుకు బయలుదేరి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని భక్తాంజనేయ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జయశంకర్ విగ్రహం వరకు ర్యాలీగా నిర్వహించారు. ఈ ర్యాలీని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. 500 సంవత్సరాల రాముని గుడి నిర్మాణం కళను బీజేపీ ప్రభుత్వం నిజం చేసిందన్నారు. అయోధ్యలో రామభక్తులకు ట్రస్టుల ద్వారా ఉచిత బస, భోజన వసతి కల్పిస్తున్నారని ప్రతీ భక్తుడు అయోధ్యకు వెళ్లి బాలరాముడిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎరుకల గణపతి, రాములు, రాంరెడ్డి, సుధాకర్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.